

వివరాలు మెయిన్‌లో

పేదరికం ఉన్నంత కాలం ప్రజలకు అండగా సిపిఐ...

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
సోమవారం | 30 జూన్ , 2025 | పేజీలు : 06


## సాగర్‌కు నెమ్మదిగా...
# శ్రీశైలంకు వేగంగా!

క్రస్ట్‌గేట్లకు సంబంధించిన పనులు పూర్తి..
ఆందోళన కలిగిస్తున్న స్పీల్‌వేపై గుంతలు..

**ప్రజాపక్షం/నందికొండ:** ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు తుంగభద్ర, జూరాల ప్రాజెక్టులు నిండటంతో శ్రీశైలం ప్రాజెక్టుకు భారీగా వరద వచ్చి చేరుతుంది దీనితో శ్రీశైలంలో విద్యుత్ ఉత్పత్తి చేపట్టడంతో సాగర్ ప్రాజెక్టుకు స్వల్ప ఇన్ ఫ్లో వచ్చి చేరుతుంది దీనితో రిజర్వాయర్ నీటిమట్టం నెమ్మదిగా పెరుగుతుంది. ఈ ఏడాది సాగర్ రిజర్వాయర్ డెడ్ స్టోరేజ్ కి చేరుకోకముందే మరి కొద్ది రోజులలో రిజర్వాయర్ జలకళనుసంతరించుకునే లా కనిపిస్తుండటంతో ప్రాజెక్టు అధికారులు ముందుగానే అప్రమత్తమై ప్రాజెక్టు క్రస్ట్ గేట్లకు సంబంధించిన అన్ని పనులు పూర్తి చేసుకుని 26 క్రస్ట్ గేట్లను డ్రై రన్ నిర్వహించడం జరిగింది.అయితే అంతా బాగానే ఉన్నా ప్రాజెక్టువిషయంలోస్పీల్ వే పై ఏర్పడ్డ గుంతలు భద్రతపై అందరిని వొకింత ఆందోళకు గురి చేస్తుంది.ఈ విషయంలో జాతీయ ఇంజనీర్ల బృందం తమ అసంతృప్తిని తెలియజేస్తూ 2023/24 లో పూర్తిచేసిన స్పీల్ వే మరమ్మతులు నాసిరకంగా ఉండటంతో వరద ఉధృతికి స్పీల్ వే పై మళ్లీ గుంతలు ఏర్పడ్డాయని ఇలా నాశిరకం పనులతో స్పీల్ వే పై గుంతలు నిత్యం పునరావృత మైతే ప్రాజెక్టుకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఎంత దూరంలో లేదని వారన్నారు. రాబోవు వరద ఉధృతిని దృష్టిలో పెట్టుకుని ప్రాజెక్టు అధికారులు గేట్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

### సాగర్ రిజర్వాయర్ సమాచారం

నాగార్జునసాగర్ రిజర్వాయర్ పూర్తిస్థాయి గరిష్ట నీటిమట్టం 590 అడుగులు కాగా ఇది 312.50 టి ఎం సీ లకు సమా నం. ప్రస్తుత నీటిమట్టం 514. 20అడుగులు ఉండగా ఇది 138.9118 టి.ఎం.సి ల కు సమానం. కుడి, ఎడమ కాలువల ద్వారా ఎటువంటి నీటి విడుదల కొనసాగడం లేదు ఎస్ఎల్‌బిసి ఏఎంఆర్పి ద్వారా 450 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో గా విడుదలవుతూ ఉంది. రివర్స్ పంప్ ద్వారా 4213 క్యూసెక్కుల నీరు వస్తూ ఉండటంతో అదే నీటితో ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి విద్యుత్ ఉత్పత్తి చేపడుతున్నారు.



# ఇందిరమ్మ ఇల్లు నమూనాల్లో పిచ్చి మొక్కలు...

### చందంపేట మండలంలో బేస్మెంట్ కట్టి వదిలిపెట్టిన అధికారులు...



**ప్రజాపక్షం/చందంపేట:** నల్గొండ జిల్లా చందంపేట మండల పరిధిలోని ఎంపిడివో కార్యాలయం నందు కట్టిన ఇందిరమ్మ ఇల్లు బేస్‌మెంట్ వరకు పనులు చేసి అలాగే ఉంచడంతో అందులో పిచ్చి మొక్కలు, గడ్డి మొలవడంతో చుట్టుపక్కల గ్రామాలలోని ప్రజలు ఇందిరమ్మ ఇల్లు నమూనాను చూపి బిత్తర పోతున్నారు. అసలు ఎందుకు కట్టారు కడితే మొత్తం కట్టి ఇందిరమ్మ ఇల్లు మోడల్ ఈ విధంగా ఉంటదని చూడడానికైనా బాగుండేది కదా అని చూసిన వారు అనుకుంటున్నారు. అధికారులు ఉన్నా చుట్టు పిచ్చి మొక్కలు మొలిచిన చూసి చూడనట్లు చూస్తున్నారని అన్నారు. కనీసం ప్రజలకు ఇందిరమ్మ ఇల్లు నమూనా చూస్తే అవగాహన వచ్చేదని ఎందుకు కట్టారు కట్టిన వాటివల్ల ఉపయోగం ఏముంది కడితే అసలు పూర్తి చేయాలి కదా ఎందుకు అధికారులు నిర్లక్ష్యమా లేక బడ్జెట్‌లేకపోవడం వల్లన అని ఇందిరమ్మ ఇల్లు కట్టబోయే వారి పరిస్థితి కూడా అదేనా ఈ విధంగా ఉండడం అసలు కారణం ఎవరు అని చుట్టుపక్కల గ్రామస్థులు మండలానికి వచ్చే ప్రజలు ఆలోచన చేస్తున్నారు. ఒకవేళ గ్రామాలలో కట్టిన మా పరిస్థితి ఇదేనా కనీసం మండల పరిధిలో ఉండి కూడా అధికారులు ఇంకా నిర్లక్ష్యం చేయడం కారణమేమిటి కనీసం ఇల్లు నమూనా పూర్తి చేసి ఉంటే ఉపయోగకరంగా ఉండేదని పలు గ్రామాల ప్రజలు చెబుతున్నారు. ఎంపిడివో లక్ష్మిని సమాచారం అడగగా వాస్తవానికి బిల్లులు లేక ఆపేశారేమో మాకు కూడా కరెక్ట్ తెలియదని ఇందిరమ్మ ఇల్లకు సంబంధించిన హౌసింగ్ డిపార్ట్‌మెంట్ అధికారులకు ఏఈకి సమాచారం ఉంటుందని తెలిపారు. ఇప్పటికైనా అది పూర్తి చేస్తారా లేదా పూర్తి చేస్తే ఎప్పటి వరకు చేస్తారని కనీసం వాటిని చూసైనా కొన్ని గ్రామాలలో ఇందిరమ్మ ఇల్లు కట్టుకునేవారు కట్టుకుంటారని అన్నా రు. మండల పరిధిలో కట్టిన ఇందిరమ్మ ఇల్లు నమూనా పిచ్చి మొక్కలను గడ్డిని వెంటనే తొలగించి నమూనా ఇందిరమ్మ ఇల్లు పూర్తి చేయాలని కోరుతున్నారు.

# గురుకుల పాఠశాల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు మొర

**ప్రజాపక్షం/మునుగోడు:** మండల కేంద్రంలోని మాత్మ గాంధీ జ్యోతిరావు పూలే బాలికల పాఠశాలలో నీటి వసతి, విద్యుత్ భోజనం సరిగా లేదని పాఠశాల విద్యార్థినిలు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.ఆదివారం ఆ పాఠశాల ముందు తమ పిల్లల్ని కలవడానికి పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు ఉండడాన్ని చూసి అటుగా వెళ్తున్న ఎమ్మెల్యే ఆ పాఠశాలను సందర్శించారు. ఆ సమయంలో మధ్యాహ్నం 1:30 గంటలకు పిల్లల్ని కలవడానికి అనుమతి ఉండడంతో తల్లిదండ్రులు అందరు గేటు దగ్గర ఎదురుచూస్తున్నారు.పాఠశాలలోకి వెళ్లి 1:00 గంటకి లోనికి అనుమతి ఇవ్వండని డ్యూటీలో ఉన్న ఉపాధ్యాయులకు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే నీటి సమస్య ఎందుకు వస్తుందని డ్యూటీ డాక్టర్స్ అడగడంతో విద్యుత్ సరఫరా సరిగా లేదని చెప్పారు వెంటనే విద్యుత్ అధికారులకు ఫోన్ చేసి సమస్య లేకుండా చూడాలన్నారు.మెస్ కాంట్రాక్టర్‌ను క్వాలిటీతో సరిపడా భోజనం పెట్టాలని, మరోసారి విద్యార్థినుల నుండి కంప్లైంట్ రాకుండా చూసుకోవాలని హెచ్చరించారు.





## స్వాతంత్ర సమరయోధురాలు రంగమ్మకు నివాళులు

**ప్రజాపక్షం/సూర్యాపేటరూరల్:** మండల పరిధిలోని రామారాం గ్రామానికి చెందిన స్వాతంత్ర సమరయోధురాలు ఉప్ప రంగమ్మ ఇటీవల మృతి చెందగా ఆదివారం మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ఆమె నివాసానికి వెళ్లి ఆమె చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరమర్శించారు. నివాళులర్పించిన వారిలో గాలి శ్రీనివాస్, మిరియాల కృష్ణమూర్తి, నల్లకుంట్ల అయోధ్య, పిట్టల వెంకటేశ్వర్లు, ఉప్ప శ్రీనివాస్, దశరథ, రామారావు, గాలి వెంకటేశ్వర్లు, చిన్న శ్రీనివాస్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ విజయానికి ప్రతి కార్యకర్త కష్టపడాలి

**ప్రజాపక్షం/చండూరుః** కాంగ్రెస్ బలోపేతం కావాలన్న, చండూరు మున్సిపాలిటీ అభివృద్ధి జరగాలన్నా ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని కాంగ్రెస్ చండూరు పట్టణ అధ్యక్షుడు అనంత చంద్రశేఖర్ , పార్టీ మున్సిపల్ కోఆర్డినేటర్ గంట సత్యం అన్నారు. ఆదివారం చండూరులోని కస్తాల రోడ్డులో ఉన్న భారతీచంద్ర గార్డెన్‌లో జరిగిన మున్సిపల్ పట్టణ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి వారు ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ మునుగోడు ఎంఎల్‌ఏ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చండూరు మున్సిపాలిటీ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని అన్నారు. మున్సిపాలిటీలోని 10వార్డులలో ఉన్న సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని కార్యకర్తలకు సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దోటి సుజాతవెంకటేశ్ యాదవ్ , ట్రస్మా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కోడి శ్రీనివాసులు , నాయకులు కల్మికొండ జనార్ధన్ , నల్లగంటి మల్లేశం ,మంచుకొండ సంజయ్ , కారింగు రాంమూర్తి , వెంకటేశం పాల్గొన్నారు.



## హమాలీ కార్మికులకు సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలి

**ప్రజాపక్షం/మునగాల:** బిజేపి ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఆల్ ఇండియా హమాలీ వర్కర్స్ పెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు కార్మికులకు పిలుపునిచ్చారు. ఆదివారం మునగాల మండల కేంద్రంలో హమాలీ కార్మికుల మండల జనరల్ బాడీ సమావేశంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. దేశంలో ఎగుమతి దిగుమతి చేసే హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు లేకపోవడం అన్యాయమని, హమాలీ పనిచేస్తున్న కార్మికులకు నడుములు వంచి బరువులు మోసి పనిచేయడం వల్ల మోకాళ్ల నొప్పులు, గుండెజబ్బులు, టిబి జబ్బులు వచ్చి ముప్పై ఏండ్లకే వృధ్దాప్యంలోకి వస్తున్నారని చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జూలై 9న దేశవ్యాప్తంగా జరుగుతు సార్వత్రిక సమ్మెలో అన్ని



రంగాలలో పనిచేసే కార్మికులు అసంఘటిత రంగ కార్మికులు ప్రభుత్వ సెక్టార్‌లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు పెద్ద ఎత్తున సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు బచ్చలకూర స్వరాజ్యం, మైసయ్యగౌడ్, అంజయ్య, మురళి, సైదులు, జానయ్య, సాలయ్య, జంబయ్య, వీరన్న, జానయ్య, మోహన్, వెంకన్న, రాంబాబు పాల్గొన్నారు.

## రామన్నపేటలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి




**ప్రజాపక్షం/ రామన్నపేట:** రామన్నపేటలో నెలకొన్న సమస్యలన్నింటిని ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జల్లెల పెంటయ్య డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో పార్టీ 8వ పట్టణశాఖ సమావేశం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. పట్టణంలోని సుభాష్‌సెంటర్ నుంచి మల్లిఖార్జున రైస్ మల్లు వరకు, దుబ్బాక మునిపంపుల గ్రామాల రోడ్లు, పట్టణంలోని పద్మశాలీ కాలనిలో తాగునీటి సమస్య, హరిజనవాడలో డ్రైనేజీ వ్యవస్థ, అదేవిధంగా కొమ్మాయిగూడెం రోడ్డు, పోలీస్‌స్టేషన్ వద్ద అస్తవ్యస్తంగా ఉన్న రోడ్డు పనులను త్వరగా ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. లేనట్లయితే పట్టణ, మండల ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడ్తామని హెచ్చరించారు. పార్టీ సీనియర్ నాయకులు ఆముద ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పట్టణశాఖ కార్యదర్శి మునికుంట్ల లెనిన్, కందుల హనుమంతు, బావండ్లపల్లి బాలరాజు, గాదె నరేందర్, గొరిగె సోములు, పాల్వంచ జగతయ్య, బావండ్లపల్లి సత్యం, తరికొప్పుల వెంకట్‌రెడ్డి, కడారి రాములు, గొరిగె మల్లేశం, కుందూరు వెంకటేశ్వర్లు, భిక్షం పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ సమష్టి బాధ్యత

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** పర్యావరణ పరిరక్షణ సమిష్టి బాధ్యత అని గ్రీన్ క్లబ్ ట్రస్టు చైర్మన్ ముప్పారపు నరేందర్, బిజేపి నాయకులు సలిగంటి వీరేంద్రలు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వర కాలనీలో గ్రీన్‌క్లట్ ట్రస్టు దశరథ పౌండేషన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటి, ఇంటింటికి తిరిగి గుడ్డ సంచులు పంపిణీ చేశారు. భావితరాలకు మంచి వాతావరణం అందించడంతో పాటు ప్రస్తుత వాతావరణం కాలుష్యం నివారణలో పాటు ప్రస్తుత వాతావరణ కాలుష్య నివారణతో పాటు, వర్షాలు, పాడిపంటలతో సమాజాభివృద్దికి తోడ్పాటు అవుతుందని అన్నారు. ప్రతి మనిషి సుమారు 7 నుంచి 8 మొక్కలు నాటితే వారికి జీవితాంతం సరిపోయే ప్రాణవాయువు లభిస్తుందన్నారు. దశరథ మెమోరియల్ పౌండేషన్ అధ్యక్షులు ఎస్‌వివి ప్రసాద్ సహకారంతో ప్రధాన కార్యదర్శి కొరిపల్లి సురేష్‌కుమార్, ఉషారాణి దంపతులు గుడ్డ సంచులు పంపిణీ




చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రామచందర్‌రావు, తిరుమలగిరినగర్ అధ్యక్షులు బండి పాపిరెడ్డి, రాముయాదవ్, జలేందర్, మల్లయ్య, యాదయ్య, వెంకటరెడ్డి, గోపిరెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, బిక్షం, శ్రీనివాసరెడ్డి, శంకర్, రాజశేఖర్, గ్రీన్‌క్లబ్ ఉపాధ్యక్షులు బొలిశెట్టి మధు, ఉప్పల శ్రావణ్, మిర్యాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## జానపద వృత్తి కళాకారుల సమస్యల పరిష్కారానికి చలో కలెక్టరేట్

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** కళ కళ కోసం కాదు కళ ప్రజల కోసం అని పిఎన్ఎం జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు అన్నారు. ఆదివారం భువనగిరి మండల మహాసభ తీరందాసు గోపి మీటింగ్ హాల్ నందు ప్రజానాట్యమండలి మొదటి మండల మహాసభ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ముత్యాలు, మాట్లాడుతూ రాష్ట ప్రభుత్వం ఎన్నికల ముందు కళాకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. కళాకారులను ఆదుకుంటామని హామీ ఇచ్చి నెలకు రూ.5 వేల పింఛను ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల జులై ఆఖరి మాసంలో ఈ జిల్లాలో ఉన్నటువంటి జానపద వృత్తి కళాకారు కళాకారులైనటువంటి చందు, యక్షగానం, కోలాటం, బాగోతం, భజన కళాకారులకు, ప్రభుత్వం గుర్తించి కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని లేనియెడల జిల్లా కలెక్టరేట్ ఆఫీస్ ముందు కాలుకు గజ్జ కట్టి చేత డప్పు పట్టి భుజాన గొంగడి వేసి పాలకుల విధానాలను ఆటపాటల ద్వారా కళాకారులను సమీకరించి ప్రభుత్వ విధానాలను ఎండగడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిఎంపిఎస్ జిల్లా అధ్యక్షులు




దయ్యాల నరసింహ పాల్గొన్నారు. అనంతరం నూతన ప్రజానాట్య మండలి కన్వీనర్‌గా బొల్లెపల్లి ప్రవీణ్ కుమార్, కో కన్వీనర్‌గా కొల్లూరు శ్రావణి, కమిటీ సభ్యులుగా బండారి మనిషా, కొన్ని గణేష్, రవి, రాజు పాశం శ్రీను ఎన్నికైనారు.

## రామన్నపేట నియోజకవర్గం సాధించేంతవరకు పోరాటం

**ప్రజాపక్షం/ రామన్నపేట:** రామన్నపేటను తిరిగి నియోజకవర్గంగా సాధించేంతవరకు పోరాటం సాగిద్దామని తెలంగాణ మలిదశ ఉద్యమకారులు రెబ్బసు రాములు ఆదివారం అన్నారు. 2008 సంవత్సరంలో డిలిమిటేషన్ మకిటీ రద్దు చేయడం జరిగిందని, కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ కమిటీ 2026లో తిరిగి నియోజకవర్గాల పునర్విభజన జరుగుతున్నందున రామన్నపేటను నియోజకవర్గంగా ప్రకటించేంతవరకు అందరు కలిసి కట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు. జూలై 1న పట్టణంలోని మత్స్యగిరి లక్ష్మీ నరసింహాస్వామి ఫంక్షన్‌హాల్‌లో జరిగే సమావేశానికి మండలంలోని ఆయా పార్టీల, ప్రజా సంఘాల నాయకులు, వివిధ వృత్తి సంఘాల నాయకులు, మహిళా సంఘాల నాయకులు, యువత అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు.ఈ సమావేశంలో నియోజకవర్గంగా ఏర్పాటయ్యేందుకు ఎజెండా రూపొందించుకుందామని ఆయన కోరారు.

## జూలై 3న కార్మిక, కర్షక జిల్లా సదస్సు




**ప్రజాపక్షం/సూర్యాపేట:** దేశవ్యాప్తంగా జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ జూలై 3న సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరిగే కార్మిక, వ్యవసాయ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ జిల్లా సదస్సు నిర్వహిస్తున్నామని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మల్లు నాగార్జునరెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నర్సింహారెడ్డి భవన్‌లో జరిగిన ప్రజా సంఘాల జిల్లా బాధ్యుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజేపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను వేగవంతంగా అమలు చేయాలని భావిస్తున్నదని అన్నారు. కార్మిక వర్గం పోరాటం చేసి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లు అమలు చేయాలని వేగవంతం చేస్తుందని ఆరోపించారు. జూలై 3న జిల్లా కేంద్రంలో జరిగే కార్మిక, కర్షక ఐక్యత సదస్సుకు ముఖ్య అతిధులుగా అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ నాయకులు, మాజీ ఎంపి తమ్మినేని వీరభద్రం హాజరవుతున్నారని చెప్పారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మట్టపల్లి సైదులు, కోట గోపి, మడ్డి అంజిబాబు, మద్దెల జ్యోతి, వీరబోయిన రవి, కడెం లింగయ్య ఉప్పల రమేష్ పాల్గొన్నారు.

## రమణేశ్వరంలో సిద్ధగురు 30వ ఆత్మ సాక్షాత్కార దినోత్సవం

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** రమణేశ్వరంలో సిద్ధగురు 30 వ ఆత్మ సాక్షాత్కార దినోత్సవం సందర్భంగా ఆదివారం చాలా ఘనంగా వేడుకలు జరిగాయి. సిద్ధగురు ఆత్మ సాక్షాత్కారం ఎన్ని రకాలుగా కలుగుతుంది అనే విషయాన్ని ఒక సమర్థుడైన గురువు సేవించి నప్పుడే ఆత్మ దర్శనం కలుగుతుంది అని ప్రవచించారు. సర్వం రుద్రాత్మకం అనే ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసిన ఆశ్రమ నిర్వాహకులు అన్నిట్లో శివుడిని ఎలా దర్శించాలి ప్రాక్టికల్‌గా అనే విషయాన్ని చెప్పారు. 11 రోజుల మౌన ధ్యాన తపో దీక్షను ముగించిన సిద్ధగురు శక్తిపాతంతో వారి కుమార్తెలైన భవానీ మాత, శివానీ మాతలకు ఆత్మ దర్శనాన్ని కలిగించారు. వారిద్దరికీ తత్వదర్శినీ అనే బిరుదు ప్రదానం కూడా చేశారు. అనంతరం అన్నదానం జరిగింది. ఈ సందర్భంగా వేలాది భక్తులు ధ్యానం, హవనం కార్యక్రమంలో పాల్గొన్నారు.





## దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత

**ప్రజాపక్షం/డిండి;** దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ప్రతి ఒక్కరు భగవంతుని పట్ల భక్తి భావంతో మెలగాలని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, డిండి ప్రాజెక్టు మత్స్యశాఖ సొసైటి చైర్మన్ మేకల కాశన్న దంపతులు అన్నారు. ఆదివారం డిండి ప్రాజెక్టు వద్ద నున్నకట్ట మైసమ్మ తల్లి ని కాశన్న సాయమ్మ దంపతులు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ప్రజలందరిని చల్లగా చూడాలని కోరారు.

## మాదక ద్రవ్యాలపై అవగాహన



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** మాదక ద్రవ్యాలు తీసుకోవడం వలన జరిగే అనర్థాల గురించి ఆదివారం స్థానిక పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు అలవాటుపడితే ఆర్థికంగా, ఆరోగ్య పరంగా అన్ని విధాలుగా నష్టపోతామని ప్రజలకు సూచించారు. గంజాయి, డ్రగ్స్, ఆల్కహాల్ వంటి మత్తు పదార్థాలకు ఎల్లప్పుడు దూరంగా ఉండాలని వాటి వలన కలిగే నష్టాల గురించి వివరించారు. ఈ అవగాహన కార్యక్రమంలో కానిస్టేబుల్స్ భాస్కర్, వెంకటేశ్వర్లు, చందు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మున్నూరుకాపులంతా ఏకం కావాలి



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** హైదరాబాద్‌లో ఆదివారం జరగబోయే మున్నూరుకాపుల రాష్ట్ర స్థాయి అధ్యక్షుల ఎన్నికల ప్రక్రియలో పాల్గొని ఓటు వేయడానికి మున్నూరుకాపు దేవరకొండ నియోజకవర్గ కో ఆర్డినేటర్ కోట్ల జగదీష్‌పటేల్ ఆధ్వర్యంలో తరలివెళ్ళారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని మున్నూరుకాపులంతా ఏకమై తెలంగాణ ప్రభుత్వం నుండి తమ హక్కులను సాధించుకోవాలని అన్నారు. ఎన్నికలకు తరలివెళ్ళిన వారిలో వివిధ మండలాల అధ్యక్షులు ఆమనగంటి కృష్ణ, బోయినపల్లి రాజు, లోకసాని నరేందర్, గోపర్ల శ్రీనయ్య, పాల్వాయి నిరంజన్, పెద్దిశెట్టి సుధాకర్, కోట్ల కృష్ణ, పన్నాల శ్రీనయ్య తదితరులు ఉన్నారు.

## కఠినంగా శిక్షించాలి

**ప్రజాపక్షం/చండూరు:** మహాన్యూస్ కార్యాలయంపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం చండూరు సెంటర్‌లో జర్నలిస్టుల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ వార్త కథనాలపై అభ్యంతాలు ఉంటే ప్రజాస్వామ్యయుతంగా స్పందించాలని ,భౌతికంగా దాడులకు పాల్పడటం సరికాదని అన్నారు. మహాన్యూస్ కార్యాలయంపై దాడి చేసి ఫర్నిచర్‌ను ధ్వంసం చేసిన నిందితులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకొని రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువలు కాపాడాలని డిమాండ్ చేశారు.

## జూలై 7న ఊరూరా ఎంఆర్‌పిఎస్ జెండా ఎగరాలి



**ప్రజాపక్షం/ఆత్మకూర్(యం):** ఎస్సీ వర్గీకరణ సాధన కోసం మందకృష్ణ మాదిగ నేతృత్వంలో ఎమ్మార్పీఎస్ చేసిన 30 ఏళ్ల పోరాటం విజయం సాధించిందని, ఈ సందర్భంగా జులై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పండుగలా చేసుకొని ఊరూరా పెద్ద ఎత్తున ఎమ్మార్పీఎస్ జెండాలను ఎగురవేసి ప్రతి గ్రామంలో సంబరాలు నిర్వహించుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ అన్నారు. మండలంలోని సింగారం గ్రామంలో మాదిగ ఎమ్మార్పీఎస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆత్మగౌరవ పథాక మంద కృష్ణ మాదిగ ముప్పై ఏండ్లు అలుపెరుగనిపోరాటం లో' న్యాయం ధర్మం మాదిగల పక్షాన ఉన్నది కనుకనే ఎస్సీ వర్గీకరణ పోరాటం విజయం సాధించిందని అన్నారు.ఎస్సీ వర్గీకరణ ద్వారా మాదిగలకు సంక్రమించిన 9% రిజర్వేషన్లను ఉపయోగించుకొని విద్యా ఉద్యోగ రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పియస్ రాష్ట్ర నాయకులు ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ, ఎమ్మార్పియస్ ఎంఎస్పీ జాతీయ నాయకులు మంద శంకర్ మాదిగ, మండల సీనియర్ నాయకులు మందుల లింగ స్వామి మాదిగ, మందుల విజయ్ మాదిగ,గట్టు రాములు మాదిగ,మందుల ఇసాక్ మాదిగ, మందుల కృష్ణ మాదిగ, ఉద్యోగ సంఘం నాయకులు ఆడెపు భిక్షపతి మాదిగ, మహిపాల్ మాదిగ పాల్గొన్నారు.

## జ్ఞానమాలతో యువతలో చైతన్యం రావాలి





**ప్రజాపక్షం/బీబీనగర్ :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జ్ఞానమాలతో యువతలో చైతన్యం రావాలని గ్రామ మాజీ సర్పంచ్ లతా రాజేష్ బాబు పిలుపునిచ్చారు. ఆదివారం కొండమడుగు గ్రామంలో బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో రెండవ వారం జ్ఞానమాల వేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో లతా రాజేష్ బాబు మాట్లాడుతూ భరత దేశా దిక్సూచి భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరు నడవాలని కోరారు. జ్ఞానాన్ని ప్రజలందరికీ పంచాలని అంతేకాకుండా భారత రాజ్యాంగంలో కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకొని యువతరం మహనీయుల అడుగుజాడల్లో నడవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శివగల ఇస్తారు, మాజీ ఎంపీటీసీ దేశం ముత్యాలు, రామాలయ కమిటీ మాజీ చైర్మన్లు బండమీ జంగయ్య, చైర్మన్ గాండ్ల బాలరాజు, ఎంఆర్పిఎస్ మాజీ మండల అధ్యక్షులు మొలగరం పాండు, చిన్నగాళ్ల అశోక్, దేశం శ్రీనివాస్ గౌడ్, మంద మల్లేష్, కడెం జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## యాదవుల ఆత్మగౌరవ సభను జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** నేడు ఇందిరా పార్క్ ధర్నా చౌక్ దగ్గర జరిగే యాదవుల ఆత్మగౌరవ సభను జయప్రదం చేయాలని జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ ఉపాధ్యక్షులు చిలకల శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. దేశంలో, రాష్ట్రంలో బీసీల్లోనే అత్యధిక జనాభా కలిగిన యాదవులకు మంత్రి పదవి, నామినేట్ పోస్టులు కేటాయించకపోవడం తీవ్ర అవమానకరమని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఎంతో త్యాగం చేసిన యాదవులకు న్యాయమైన వాటా దక్కాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇంత అన్యాయం జరుగుతుంటే యాదవులు మౌనంగా ఉండటం బానిసలతో సమానమని అన్నారు. మన న్యాయమైన వాటా కోసం ఇందిరాపార్క్ దగ్గర జరిగే యాదవుల ఆత్మగౌరవ సభను పార్టీలు, సంఘాలకు అతీతంగా పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని శ్రీనివాస్ యాదవ్ విజ్ఞప్తి చేశారు.

## మాదాపూర్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** పల్లె పల్లెకి వైద్యం కార్యక్రమంలో భాగంగా 121వ ఉచిత మెగా వైద్యశిబిరాన్ని తుర్కపల్లి మండలం మాదాపురం గ్రామంలో ఆదివారం నిర్వహించారు. భువనగిరి పట్టణంలోని ఆర్కే హాస్పిటల్, చావా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉచిత మెగా వైద్య శిబిరంలో ఆర్కే హాస్పిటల్ అధినేత డాక్టర్ చావా రాజ్ కుమార్, జనరల్ ఫిజీషియన్, డయాబెటాలజిస్ట్, డాక్టర్ చావా అసలేష డెంటిస్ట్, డాక్టర్ శ్రీనాథ్, స్కిన్ స్పెషలిస్ట్ రఘువీర్,డైరెక్టర్ శ్రీ రుద్ర స్కిన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు.అనంతరం వారికి అవసరమయిన బిపి షుగర్, బిఎండి పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ల సలహా మేరకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామ ప్రజలు వివిధ కారణాలవల్ల ఆసుపత్రికి వెళ్లి వైద్యం తీసుకోవడం నిర్లక్ష్యం చేస్తున్నారని కనీసం వారి వద్దకే డాక్టర్లు వచ్చి వారికి అవసరమగు పరీక్షలు నిర్వహించినప్పుడు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వారి ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ చవా రాజ్ కుమార్ తెలిపారు.



## ప్రమాదకరంగా మారిన ప్రధాన రహదారిని పరిశీలన

**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ నుండి హుజూర్‌నగర్ వెళ్లే ప్రధాన రహదారి బాలాజీనగర్ ఫ్లై ఓవర్ వద్ద రోడ్డు పూర్తిగా డ్యామేజి అయ్యి ప్రమాదాలకు నిలయంగా మారిందని తెలుగుదేశంపార్టీ మాజీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ముత్తినేని సైదేశ్వరరావు అన్నారు. ఆదివారం ఆధ్వరంలో టిడిపి నాయకులతో కలిసి వెళ్లి గుంతల మయంగా రహదారిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం వేలాది మంది ప్రయాణించే ఈ రహదారిలో ముఖ్యంగా కూడలి వద్ద రోడ్డు నాణ్యత లేకపోవడంతో కోతకు గురై అస్తవ్యస్తంగా ఉండటం వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, రాత్రి వేళ్లలో వాహనదారులు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. అర్‌అండ్‌బి అధికారులు, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఉప్పగండ్ల శ్రీనివాసరావు, గురవయ్య, కొల్లు సత్యనారాయణ, సైదయ్యగౌడ్, నర్సయ్య, గద్దె వెంకటేశ్వరరావు, మాదాల రాంబాబు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి



**ప్రజాపక్షం/ మాడ్గులపల్లి:** కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి సాధ్యమవుతుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు కొండేటి మల్లయ్య అన్నారు. ఆదివారం మండలంలోని ధర్మాపురం, కన్నెకల్, గోపాలపురం గ్రామాల్లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన ప్రతి హామిని అమలు చేశారని, నిరుద్యోగులకు 60వేల ఉద్యోగాలు, ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు, సన్నబియ్యం, అన్నదాతలకు రుణమాఫీ, రైతుభరోసా అందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సైదిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, బోడ యాదయ్య, కొత్త దశరథ, గద్దల శేఖర్, రామాంజిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, కొండ భాస్కర్, కొండేటి శంకర్, హౌజింగ్ ఏఈ జ్యోతి, గ్రామ కార్యదర్శులు హరికృష్ణ, నాగరమణి, ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులు యాదయ్య, శంకర్, నాగయ్య, రేణుక పాల్గొన్నారు.

## ఘనంగా సరళ మైసమ్మ దేవస్థానం బ్రహ్మోత్సవాలు

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** చౌటుప్పల్ మండలం అల్లాపూర్ శివారులోని రాచకొండ గుట్టలో వెలసిన సరళ మైసమ్మ ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి దంపతులకు అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం దేవస్థాన కమిటీ ఎమ్మెల్యే దంపతులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ యొక్క కార్యక్రమంలో మునుగోడు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయ కర్త పబ్బు రాజు గౌడ్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, మాజీ జెడ్పిటిసి చిలుకూరి ప్రభాకర్ రెడ్డి, అర్థ వెంకటరెడ్డి, మొగుదాల రమేష్ గౌడ్, కోయ్యడ సైదులు, దేవస్థాన కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.





## వాటర్ ఫిల్టర్ ప్రారంభం

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం):** మండలం కాల్వపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు యెల్లంల సంజీవరెడ్డి సొంత నిధుల తో ఏర్పాటు చేసిన వాటర్ ఫిల్టర్ ను ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎల్లంల సంజీవరెడ్డి,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యాస లక్ష్మారెడ్డి, పిఎసిఎస్ జిల్లాల శేఖర్ రెడ్డి, ముద్ద సాని సిద్ధులు గౌడ్, తండ శ్రీశైలం గౌడ్, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారిజాల వేణుగోపాలస్వామి సన్నిధిలో మాజీ స్పీకర్ పోచారం

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి :** మండలం పరిధిలోని గోపలాయిపల్లి గ్రామంలోని శ్రీవారిజాల వేణుగోపాల స్వామి దేవస్థానంలో తెలంగాణ రాష్ట్ర మాజీ శాసన సభ స్పీకర్ ,బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి తన మిత్రులతో కలిసి స్వామి వారిని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఛైర్మన్ కోమటిరెడ్డి మోహన్ రెడ్డి పిలుపు మేరకు హైస్కూల్ స్నేహితులతో విచ్చేసిన శ్రీనివాస్‌రెడ్డి, మిత్రబృందంతో ఆలయ అర్చకులు స్వామి వారికి పూజలు చేసి స్వామి వారి ఆశీర్వచనంతో పాటు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బత్తుల ఉషయ్య, జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వద్దే భూపాల్ రెడ్డి, ఔరవాణి మాజీ ఉపసర్పంచ్ జక్కిలి పరమేష్, సోషల్ మీడియా కో ఆర్డినేటర్ పులిజాల రవికుమార్, ముప్పిడి శంకర్, పులిజాల మహేష్, బొజ్జ శివ తదితరులు పాల్గొన్నారు.



## వరుణ దేవా... మా మొర ఆలకించవా....



**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి:** కాలం లేక రైతన్నల బాధలు వర్ణణాతీతంగా మారిందనడానికి గ్రామదేవతల పూజలే నిదర్శమని చెప్పుకోవచ్చు. ఇదే తరహాలో మండలం పరిధిలోని మాండ్ర గ్రామంలో సకాల వర్షాలు లేక పంట పొలాలకు , పత్తిచేన్లకు నీటి ఎద్దడి ఏర్పడడంతో రైతన్నలు ఎదుర్కొంటున్న సమస్యలపై గ్రామ దేవతలకు మొరపెట్టుకుంటున్నారు. ఆదివారం తాజా మాజీ సర్పంచ్ దొండ సౌమ్య ఆధ్వర్యంలో గ్రామంలోని బొడ్రాయికి గ్రామస్థులు ప్రతి ఇంటి నుండి బిందెడు నీళ్ళను తీసుకొచ్చి జలాభిషేకం చేశారు. ఇకనైన వరుణిని కరుణించమని, వర్షాలు కురవాలని పంటలను పచ్చగా పండేలా రైతన్నల కళ్లలో ఆనందం చిగురించేలా చినుకులు పడాలని మహిళలు వేడుకుని ప్రత్యేక పూజలు చేశారు. సరోజన, శైలజ, అండాలు జ్యోతి, రేణుక , గ్రామస్థులు పాల్గొన్నారు.

## గెల్లు శ్రీనివాస్ అరెస్టు అన్యాయం...

**ప్రజాపక్షం/దేవరకొండ;** బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసే విధంగా మహా న్యూస్ ఛానల్‌లో ప్రసారాలను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన నిర్వహించిన బిఆర్ఎస్‌వి రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, ఇతర నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం దారుణమని అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని బిఆర్‌ఎస్‌వి రాష్ట్ర ఉపాధ్యక్షులు వేముల రాజు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కేటీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కొలేక అసత్యాలను ప్రసారం చేసి దుర్మార్గానికి పాల్పడుతున్నారన్నారు. మీడియా ముసుగులో కొన్ని చానల్స్, పత్రికలు పనిగట్టుకొని విషప్రచారం చేస్తున్నాయని అలా చేస్తున్న వారి వైఖరిలో మార్పులు రాకపోతే భవిష్యత్తులో మరిన్ని భౌతిక దాడులు జరగుతాయని ఈ సందర్భంగా హెచ్చరించారు. మహా న్యూస్‌పై జరిగిన దాడిని ఖండించిన ప్రముఖులు అదే విధంగా కేటీఆర్ వ్యక్తిగత ప్రతిష్టను దిగజార్చే విధంగా మీడియాలో జరిగిన ప్రచారాన్ని ఎందుకు ఖండించలేదని ఆ యన ప్రశ్నించారు. మహాన్యూస్ యాజమాన్యం తక్షణమే కేటీఆర్‌కు క్షమాపణ చెప్పాలని వారు చేసిన ప్రసారాలు తప్పిదాలని ఒప్పుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## మదర్ డైరీ పాల సంఘం చైర్మన్ యాదగిరి, సిద్దులు ఏకగ్రీవం



**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం వెల్మజాల, సుద్దాల మదర్‌డైరీ చైర్మన్ ల ఎన్నికల ఆదివారం జరిగింది. వెల్మజాల మదర్‌డైరీ పాలసంఘం చైర్మన్‌గా బిఆర్ఎస్ పార్టీకి చెందిన ఎనగందుల యాదగిరి మూడవ సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సుద్దాల గ్రామ మదర్ డైరీ పాల సంఘం చైర్మన్‌గా బిఆర్ఎస్ పార్టీకి చెందిన మలిగ సిద్దులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా సంపత్‌రెడ్డి, స్వప్న లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన చైర్మన్లు మాట్లాడుతూ పాల ఉత్పత్తిదారులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి చొరవచూపుతానని అన్నారు. పాలక వర్గ సహకారంతో పాల సెంటర్ అభివృద్ధికి ముందుండి సహకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పివైస్ చైర్మన్ పాండరీగౌడ్, మాజీ ఉప సర్పంచ్ ఐలయ్య, బిఆర్ఎస్ అధ్యక్షులు మోగిలాల్, కుమారస్వామి, మైసయ్యగౌడ్, యాదయ్యగౌడ్, పుల్లారెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందజేత




**ప్రజాపక్షం/వలిగొండ :** వలిగొండ మండలం అరూరు గ్రామానికి చెందిన బోళ్ళ శేఖర్ అనారోగ్యంతో మరణించారు. మృతుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తు రూ.10,000 ఆర్థిక సహాయాన్ని డిసిసి ఉపాధ్యక్షులు వాకిటి అనంత రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖా అధ్యక్షులు బుర్ర నరసింహ, మాజీ ఉప సర్పంచ్ సుక్క ముత్యాలు, మచ్చ గిరి గుట్ట డైరెక్టర్ కోడితల కరుణాకర్, సెవధల్ ఉపాధ్యక్షుడు కోపుల బాలరాజు, పాల సంఘం డైరెక్టరులు బుర్ర శ్రీ శైలం, రెబస్ సత్తయ్య, దమెర అంజయ్య, జినుకల మల్లేష్, మర్రి ముత్యాలు, రెబస్ నరసింహ, అర్జున్, దోతీ కిష్టయ్య, మర్రి నాగరాజు, సిద్ధయ్య పాల్గొన్నారు.

## యువతతో ప్రతిజ్ఞ



**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి:** గంజాయి సేవిస్తున్నరనే అనుమానంతో యువతకు గంజా టెస్టులను చేసి వారికి గంజాయి సేవించడం వల్ల కలిగే అనార్ధలను, ఆర్థిక ఇబ్బందులపై నార్కట్‌పల్లి ఎస్ఐ డి క్రాంతి కుమార్ కౌన్సిలింగ్ ఇచ్చారు. శనివారం రాత్రి పట్టణంలోని పోలీస్ స్టేషన్ పరిధిలో అనుమానస్పందంగా కనిపించిన యువతను స్టేషన్‌కు పిలిపించి టెస్టులను చేసిన అనంతరం వారికి గంజాయి వాడకంతో నష్టపోతున్న భవిష్యత్తుపై వివరణ ఇచ్చారు.అనంతరం వారితో ప్రతిజ్ఞ చేయించారు.

## దయ్యం బండ తండాలో పాల డైరీ చైర్మన్ ఎన్నిక




**ప్రజాపక్షం/తుర్కపల్లి :** మండలంలోని దయ్యం బండ తండా గ్రామంలో పాలడైరీ సహకార సంఘం ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికలు చైర్మన్‌గా రెండవసారి వాంకుడోతూ మహేందర్ నాయక్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన డైరెక్టర్లు గా సుధాకర్, నరేందర్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లలితా శ్రీనివాస్ నాయక్, మాజీ చైర్మన్ రాము నాయక్, మహేందర్, లక్ష్మ ణ్, మాజీ వార్డు సభ్యులు లచ్చి రామ్ నాయక్, నవీన్, లక్ష్మ ణ్, బిచ్చు, శీను, మష్రూమ్ రమేష్, సంతు తదితరులు పాల్గొన్నారు.

## విద్యాహక్కు చట్టాన్ని ఉల్లంఘిస్తున్న ప్రైవేట్ పాఠశాలలు

**ప్రజాపక్షం/దేవరకొండ;** తెలంగాణ రాష్ట్రంలో అనేక ప్రైవేట్ పాఠశాలలు విద్యను వ్యాపారంగా మార్చి కేంద్రప్రభుత్వం రూపొందించిన విద్యా హక్కు చట్టం (ఆర్‌టిఈ 2009)కు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయని గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, విద్యార్థుల రాజకీయ పార్టీ జిల్లా అధ్యక్షులు కేతావత్ బాబురాం అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలు ఏమాత్రం పాటించకుండా, విద్యార్థులపై మానసిక ఒత్తిడిని కలిగించే విదంగా స్వచ్ఛందంగా సిలబస్ తయారు చేసుకుంటూ, విద్యను వ్యాపార వేదికలుగా మారుస్తున్నాయని తక్షణమే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలని విద్యాశాఖ కమిషనర్‌కు వినతి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రైవేట పాఠశాలల అధిక ఫీజుల దోపిడిని అరికట్టాలని ఆదివారం పాఠశాలల విద్యాశాఖ కమిషనర్ నవీన్ నికోలస్‌కు బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్యయాదవ్, బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్‌లు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిర్యాలగూడ పట్టణంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యాహక్కు చట్టాన్ని ఉల్లంఘిస్తూ ఎల్‌కేజీ విద్యార్థి నుంచి సుమారు రూ.85వేల వరకు ఫీజు, అడ్మిషన్ ఫీజు రూ.10వేలు వరకు వసూలు చేస్తున్నారని అన్నారు. అదేవిధంగా తమ పాఠశాలల యజమాన్యాలు స్కూల్ ఆవరణలోనే పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాం, షూస్, బెల్టు, టై అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. తీసుకుంటున్న ఫీజుల వివరాలను పాఠశాలల్లో నోటీసు బోర్డులో ఉంచాలని అన్నారు. కార్యక్రమంలో ఉపేందర్, శ్రీనివాస్, రాజు, సైదయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఉబ్బపల్లి సోములు కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరణ

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఉబ్బపల్లి సోములు కాంస్య విగ్రహాన్ని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉబ్బపల్లి సోములు ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని అన్నారు. నాకు వ్యక్తిగతంగా చాలా దగ్గరి మిత్రుడని గుర్తు చేశారు. అనంతరం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్లు తిరునగరు భార్గవ్, మెరుగు రోశయ్య, నాయకులు మగ్దుంపాషా, నాగార్జునచారి, చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, యడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, మట్టపల్లి సైదయ్యయాదవ్, ఇలియాస్, మాజీద్, రామలింగయ్యయాదవ్, పెద్ది శ్రీనివాస్‌గౌడ్, కోల రామస్వామి, దైద వెంకటేష్, ప్రసాద్, విష్ణు, చందుయాదవ్, పెద్ది శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.



# పీడిత ప్రజల ఆశాజ్యోతి భారత కమ్యూనిస్టు పార్టీ



**సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు శింగు నరసింహారావు**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** దేశ స్వతంత్రానికి ముందే పుట్టి, దేశంలో సంపూర్ణ స్వతంత్రం కావాలని నినదించి, నాటి నుండి, నేటి వరకు పీడిత ప్రజల కోసం పోరాడుతున్న ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ అని, సిపిఐ బలోపేతానికి ప్రతి కార్యకర్త పనిచేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సింగు నరసింహారావు పిలుపునిచ్చారు. సిపిఐ సత్తుపల్లి పట్టణ 5వ మహాసభ పాలకుర్తి వీరయ్య, కాగిత వెంకటేశ్వర్లు, మహాదేవ లక్ష్మి ల అధ్యక్షతన తాపీ వర్కర్స్ బిల్డింగ్ నందు ఆదివారం నిర్వహించారు. ముందుగా సిపిఐ జండా ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో సింగు నరసింహారావు మాట్లాడుతూ భారతదేశ స్వతంత్రంలో అనేక మంది కమ్యూనిస్టులు వీరమరణం పొందారని, స్వతంత్ర ఉద్యమంతో ఎలాంటి సంబంధం లేని బీజేపీ, ఆర్,ఎస్,ఎస్ మతోన్మాదులు ఈ దేశ రాజ్యాంగాన్ని, దేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీసేందుకు కుట్రలు సాగిస్తున్నారని, ప్రజల మధ్య కుల, మతాల చిచ్చుపెట్టి దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కుట్ర చేస్తున్నారని ఆయన విమర్శించారు. తెలంగాణలో నైజాం నవాబుకు వ్యతిరేకంగా 4500 మంది కమ్యూనిస్టులు ప్రాణాలర్పించి, నైజామును గద్దించిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీకి ఉందని, భారత కమ్యూనిస్టు పార్టీ పోరాటాల పార్టీ అని, భారత కమ్యూనిస్టు పార్టీ త్యాగాల పార్టీ అని, ఈ పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ, హక్కుల కోసం అడిగిన వారిని జైల్లో వేస్తూ, భారత రాజ్యాంగానికి విఘాతం కలిగించే పద్ధతుల్లో అప్రకటిత ఎమర్జెన్సీని నడిపిస్తుందని ఆయన విమర్శించారు. జిల్లా కార్యవర్గ సభ్యులు శివరామకృష్ణ మాట్లాడుతూ దేశం, రాష్ట్రంలో ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడేది సిపిఐ మాత్రమేనని, అనేక హక్కులు, చట్టాలు పోరాడి సాధించుకున్నవని, మోడీ ప్రభుత్వం వచ్చాక, 44 కార్మిక చట్టాలను, నాలుగు కోడ్ లుగా విభజించి కార్మిక వర్గాన్ని విచ్ఛిన్నం చేసే కుట్రలకు పాల్పడుతుందని, కార్మిక వర్గం ఐక్యంగా జులై 9న జరిగే సమ్మెలో పాల్గొని నరేంద్ర మోడీకి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ మాట్లాడుతూ సత్తుపల్లి ప్రాంతంలో సిపిఐ ఆధ్వర్యంలో సింగరేణి ప్రభావిత ప్రాంతాల్లో సమస్యల పరిష్కరించాలని, ఇళ్ల స్థలాలు లేని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఉపాధి హామీ సమస్యల పరిష్కారం కోసం హమాలీ, ఆటో మధ్యాహ్న భోజన కార్మికులు, అంగన్ వాడి, ఆశ ఇంకా అనేక రంగాల్లో విస్తరించి పోరాటాలు నిర్వహిస్తున్న పార్టీ సిపిఐ అని, సింగరేణి కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడుతూ, కార్మిక వర్గ రక్షణ కోసం అనేక పోరాటాల నిర్వహిస్తున్న పార్టీ సిపిఐ అని, ఈ ప్రాంతంలో సిపిఐ బలోపేతానికి కార్యకర్తలు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సత్తుపల్లి పట్టణ కార్యదర్శి నిమ్మటూరి రామకృష్ణ, సత్తుపల్లి మండల కార్యదర్శి తడికమళ్ళ యోబు, సింగరేణి బ్రాంచ్ కార్యదర్శి సముద్రాల సుధాకర్, సిపిఐ మహిళా సమైక్య సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి ఎస్కె రంజాన్ బి, సిపిఐ వేంసూరు మండల కార్యదర్శి రామలక్ష్మి , కాగిత వెంకటేశ్వర్లు, మోతిలాల్, కోలేటి వెంకటేశ్వర్లు, పిల్లి భాస్కర్, దానియేలు, రాజు, పూజ, సీత, రామారావు, ఎస్.కె రహ్మతుల్లా, ఏఐవైఎఫ్ సత్తుపల్లి డివిజన్ అధ్యక్ష ,కార్యదర్శులు ఎస్ కే హమీద్, బి అజయ్, వేంసూరు మండల సహాయ కార్యదర్శి కిన్నెర మారయ్య, ఎర్రజల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# పత్తి సాగుకే రైతన్న మొగ్గు!

**ప్రజాపక్షం/ఖమ్మం :** గతేడాది పత్తి సాగు చేసిన రైతులకు కష్టాలు, నష్టాలే మిగిలిన ఈ ఏడాది కూడా రైతాంగం పత్తి వైపే మొగ్గు చూపడం గమనార్హం. ఖమ్మం జిల్లా సహా రాష్ట్ర వ్యాప్తంగా వాణిజ్య పంటల్లో పత్తి కే ప్రాధాన్యతనిస్తున్నారు. వరి సాగు తర్వాత తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పత్తికే ప్రాధాన్యత లభిస్తుంది. ఖమ్మం జిల్లాలో గతేడాది కంటే స్వల్పంగా తగ్గిన ద్వితీయ స్థానం మాత్రం పత్తికే దక్కింది. గతేడాది పత్తి దిగుబడులతో పాటు ధర కూడా రైతులను నష్టపరిచింది. అధిక వర్షాలకు ఎకరాకు నాలుగైదు క్వింటాళ్లకు మించి రాలేదు. కేంద్ర ప్రభుత్వం పత్తికి మద్దతు ధర ప్రకటించిన క్షేత్ర స్థాయిలో ఆ ధర అమలు కాలేదు. రక రకాల కొర్రీలు పెట్టి సిసిఐ పత్తిని కొనుగోలు చేసేందుకు నిరాకరించింది. రైతాంగం దగ్గర నుంచి కొనుగోలు చేసేందుకు నిరాకరించిన సిసిఐ అధికారులు ప్రైవేటు వ్యాపారుల వద్ద నుంచి మాత్రం అధికంగా పత్తిని కొనుగోలు చేశారన్న ఆరోపణలు వినవచ్చాయి. గతేడాది నష్టపోయిన రైతులు ఈ ఏడాది కూడా పత్తిని గణనీయమైన సంఖ్యలో సాగు చేయడం వెనక ప్రత్యామ్నాయ పంటల సాగు లేకపోవడమేనన్నది వాస్తవం. గతంలో పునాస పంటలుగా పెసర, మినుము, కంది, వేరుశనగ తదితర పంటలను సాగు చేశారు. ఇప్పుడు అపరాల సాగు పూర్తిగా తగ్గిపోయింది. అననుకూల వాతావరణం కారణంగా అపరాలను సాగు చేసిన ఫలితం దక్కడం లేదు. అతివృష్టో, అనావృష్టో అపరాల పంటను దెబ్బతీస్తుంది. వరి సాగు తర్వాత రైతులు పత్తి, మిర్చి సాగు చేస్తున్నారు. ఖమ్మం జిల్లాలో గతేడాది కంటే ఈ ఏడాది మిర్చి సాగు తగ్గే అవకాశం ఉంది. రెండేళ్ల క్రితం క్వింటా రూ. 20వేల వరకు పలికిన మిర్చి గతేడాది క్వింటా రూ. 10వేలకు మించి ధర పలకలేదు. ఇదే సమయంలో రెండేళ్ల క్రితంతో పోలిస్తే దిగుబడి కూడా గణనీయంగా తగ్గిపోయింది. దిగుబడి తగ్గడం ధర లేకపోవడంతో మిర్చి రైతులు తీవ్రంగా నష్టపోయారు. మరోసారి మిర్చి సాగు చేసేందుకు జంకుతున్నారు. మిర్చి సాగుకు జంకడం కూడా పత్తి వైపు మొగ్గు చూపేందుకు కారణమవుతుంది. పత్తి తర్వాత నవంబర్, డిసెంబర్ మాసాల్లో మొక్కజొన్న సాగుకు రైతు ఆసక్తి చూపుతున్నాడు. గడిచిన ఐదేండ్లుగా మొక్కజొన్న సాగు రైతాంగానికి లాభసాటిగా ఉంది. గతేడాది మరింత మంచి ఫలితాలను మొక్కజొన్న సాగు ఇచ్చింది. 30 నుంచి 40 క్వింటాళ్ల వరకు దిగుబడి రావడం రూ. 2200పైబడి ధర పలకడంతో మొక్కజొన్న లాభసాటిగా మారింది. ఈ ఏడాది కూడా యాసంగిలో మెట్ట పొలాల్లో మొక్కజొన్న సాగుకు రైతులు సంసిద్ధమవుతున్నారు. వరి తప్ప మరో సాగు చేయడానికి వీలులేని మాగాణి భూముల్లో రైతులు తిరిగి వరినే సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. లాభ నష్టాలు లేని పంటగా చెప్పుకునే వరి సాగు గతేడాది రైతులకు లాభాలను చేకూర్చింది. సన్న రకం ధాన్యానికి రూ. 500 బోనస్ ఇవ్వడం దిగుబడి ఆశాజనకంగా ఉండడంతో ఒకప్పుడు వరి దండగ అన్న భావనలోఉన్న రైతులు తిరిగి వరి సాగు వైపుకు మొగ్గు చూపుతున్నారు. కాకపోతే ఈ ఏడాది ఇప్పటి వరకు వాతావరణం ఆశాజనకంగా లేదు. ప్రధాన ప్రాజెక్టులైన నాగార్జున సాగర్ సహా అటు గోదావరి ఇటు కృష్ణా పరివాహక ప్రాంతాల్లోని సాగునీటి ప్రాజెక్టులలో ప్రస్తుతానికి నీరు లేదు. జూరాల శ్రీశైలానికి వరద చేరిందన్న వార్తలు వచ్చిన ప్రాజెక్టులు నిండ లేదు. తెలంగాణలో 10 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించే నాగార్జున సాగర్ ప్రాజెక్టులోకి నీరు చేరితే నల్లగొండ, ఖమ్మంజిల్లాలో సాగు గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. గోదావరి పరివాహక ప్రాజెక్టుల్లో కూడా నీరు చేరలేదు. భారీ, మధ్యతరహా, చిన్నతరహా నీటి ప్రాజెక్టులకు కూడా సాగునీరు అందించేందుకు ప్రస్తుతానికి అవకాశం లేదు. జులై మాసంలో భారీ వర్షాలు కురిస్తే వరి సాగుకు సమాయత్తమయ్యే అవకాశం ఉంది.

# ముఖ్యమంత్రి, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చిత్ర పటాలకు మండల పరిధిలోని కోయచలక గ్రామంలో పాలాభిషేకాలు నిర్వహించారు. రైతుభరోసా నిధులు, నూతన రేషన్ కార్డులు మంజూరు చేసినందుకు ఆదివారం మాజీ ఉప సర్పంచ్ చెరుకూరి పూర్ణచందర్ రావు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చిత్ర పటాలకు రైతులతో కలిసి పాలాభిషేకం నిర్వహించి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చెరుకూరి పూర్ణచందర్ రావు మాట్లాడుతూ వానాకాలం సాగు ప్రారంభమైన నేపథ్యంలో పెట్టుబడుల కోసం రైతులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారధ్యంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు చొరవతో తొమ్మిది రోజుల్లోనే తొమ్మిదివేల కోట్ల రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసిందన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్న రైతులకు రెండు లక్షల రుణమాఫీతో పాటు రైతుభరోసా, రైతు బీమా వంటి పథకాలను అమలు చేస్తుందన్నారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం పలు పథకాలను అమలు చేస్తుందన్నారు. నూతనంగా రేషన్ కార్డులను కూడా మంజూరు చేసిందన్నారు. రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తుందన్నారు. అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాధంశెట్టి హన్మంతరావు, ఏఎంసి డైరెక్టర్ చెరుకూరి సీతారాములు, మాధంశెట్టి సీతారాములు, చెరుకూరి ముత్తయ్య, చెరుకూరి కృష్ణారావు, అమరం అప్పారావు, తోట పెంటయ్య, రైతులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే పిడియాక్ట్

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై పిడియాక్ట్ నమోదు చేసి అమలు చేసున్నట్లు పోలీసు కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. ఆదివారం ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఖమ్మం అర్బన్ మండలం అగ్రహా రం న్యూ కాలనికి చెందిన పగడాల విజయ్ అలి యాస్ చంటి హత్యాయత్నం, దాడులు, దౌర్జన్యాలు, బెదిరింపులు, గుండాయిజం, వంటి పలు కేసుల్లో కిలక నిందితుడిగా ఉన్నట్లు తెలిపారు. పలు సంద ర్భాల్లో పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించినా తిరిగి అనతికాలంలోనే జామినిపై విడుదలై ఖమ్మం లో తరచూ తీవ్రమైన నేరాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. ఇలాంటి నిందితుడి వల్ల ప్రజల భద్రతకు ముప్పు కలుగుతుందనే ఉద్దేశ్యంతో ఇతని నేరాలకు శాశ్వతంగా చెక్‌పెట్టేందుకు విజయ్‌పై పిడియాక్ట్ అమలు చేసి ఖమ్మం ఖానాపురం హావేలీ పోలీసుస్టేషన్ సిఐ భానుప్రకాష్ ఆధ్వర్యంలో హైదరాబాద్ చంచల్‌గూడ సెంట్రల్ జైలుకు తరలించినట్లు సిపి తెలిపారు.

# రోడ్లపై ఫుల్‌వీల్స్ ట్రాక్టర్లు నడపవద్దు

**నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు : ఎస్సై రామారావు**

**ప్రజాపక్షం/వైరా:** రోడ్లపై ఫుల్‌వీల్స్ ట్రాక్టర్లు నడిపి రోడ్లను పాడు చేయవద్దని ట్రాక్టర్ల యజమానులు సహకరించాలని వైరా ఎస్సై పి.రామారావు అన్నారు. శనివారం ఎస్సై రామారావు మాట్లాడుతూ ఫుల్‌వీల్స్ ట్రాక్టర్లు రోడ్లపై తిప్పడం వలన రోడ్లు పాడైపోతాయని దాంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, గ్రా మీణ ప్రాంతాల్లో రోడ్లు ముఖ్యంగా పాడైపోతాయని, దీనిని ప్రతిఒక్క ట్రాక్టర్ నిర్వాహకులు గమనించాలని ఆయన అన్నారు. ని బంధనలకు విరుద్ధంగా రోడ్లపై ఫుల్వీ ట్రాక్టర్లు నడిపితే చట్టపరంగా చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని తెలిపారు. మన రోడ్లను మనమే కాపాడకోవాలని వ్యవసాయ కాలం ప్రారంభమైన నేపద్యంలో వరి నాట్లు సమయంలో ముఖ్యంగ్రా టాక్టర్ నిర్వాహకులు ఫుల్‌వీల్స్ ట్రాక్టర్లు రోడ్లపైకి రానివ్వద్దని వ్యవసాయ భూములు ఉన్న వద్దకి ట్రాక్ట ర్లు తీసుకెళ్లి ఆ ప్రాంతంలోనే ఫుల్‌వీల్స్ ఫిట్ చేసుకొని తొక్కించుకోవాలని ఆయన సూచించారు. ఫుల్‌వీల్స్ ట్రాక్టర్లపై ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం జరుగుతుందని ఎస్సై రామారావు తెలిపారు.

# వైరా కమ్మజన సేవా సమితి కల్యాణ మండపం నూతన కమిటీ ఎన్నిక



**అధ్యక్షుడిగా కట్టా కృష్ణార్జున్‌రావు**



**ప్రజాపక్షం/వైరా:** వైరాలో కమ్మజన సేవా సమితి సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య సమన్వయకర్తలుగా మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్,కమ్మజన సేవా సమితి ఫౌండర్ అడపా అప్పారావు, ప్రముఖ న్యాయవాది కాటంనేని రమేష్, మందపు మధుసూదన్‌రావు సమన్వయంతో ఏకగ్రీవంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కమ్మజన సేవాసమితి కళ్యాణ మండపం అధ్యక్షులుగా కట్టా కృష్ణార్జున్‌రావు, ఉపాధ్యక్షులుగా మేదరమెట్ల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా చింతనిప్పు రాంబాబు, జాయింట్ సెక్రటరీగా సూర్యదేవర శ్రీధర్, కోశాధికారిగా ఏనుగు హనుమంతరావులను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా మరి కొంత మందిని ఎన్నుకున్నారు. గౌరవ సలహా మండలి అధ్యక్షులుగా శ్రీరామనేని రామస్వామి, చింతనిప్పు వెంకటయ్య, దామా వీరయ్యలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు మాట్లాడుతూ కమ్మజన సేవా సమితి అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. సంఘం ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమ్మజన సేవా సమితి నిర్వాహకులు కట్టా కృష్ణార్జున్‌రావు, మేదరమెట్ల శ్రీనివాసరావు, చింతనిప్పు రాంబాబు, చింతనిప్పు వెంకటయ్య, శ్రీరామనేని రామస్వామి, రాంపూడి రోశయ్య, అడపా రామకోటయ్య, చింతనిప్పు మురళీధర్‌రావు , వాసిరెడ్డి రమేష్, కమ్మజన సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

# దురిశెట్టి కుటుంబానికి యుగందర్ పరామర్శ

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పట్టణానికి చెందిన దురిశేటి శ్రీనివాసరావు (సాయి పూజిత శ్రీను) తండ్రి దురి శేటి నాగాచారి (85) ఇటీవల మృతి చెందగా విష యం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయ కులు తుమ్మల యుగందర్ ఆదివారం శ్రీను నివా సానికి చేరుకుని నాగాచారి చిత్రపటానికి పూలమా ల వేసి, ఘన నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట కొల్లి శ్రీను,గోదా విష్ణు తదితరులున్నారు.

# పేదలకు ఉచిత హెల్త్ క్యాంపులతో మేలు



## ఎమ్మెల్యే మట్టా రాగమయి



ప్రజాపక్షం/సత్తుపల్లి: వివిధ స్వచ్ఛంద సంస్థలు, పలు అసోసియేషన్లు, సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే ఉచిత హెల్త్ క్యాంప్‌లు ప్రజలకు ఎంతగానో మేలు చేస్తాయన్నారు సత్తుపల్లి శాసన సభ్యురాలు డా. మట్టా రాగమయి దయానంద్ విజయకుమార్. డాక్టర్స్ డే సందర్భంగా జామే మసీద్ కమిటీ, ఇండియన్ మెడికల్, డాక్టర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని మసీద్ రోడ్ లో గల జామే మసీద్, జేవిఆర్ డిగ్రీ కళాశాల ప్రాగణంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత హెల్త్ క్యాంప్‌లను సత్తుపల్లి ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డా. మట్టా దయానంద్ విజయ్ కుమార్ లు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. అనంతరం స్వయంగా స్టెతస్కోప్ పట్టి ఎమ్మెల్యే దంపతులు రోగులను పరీక్షించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య రక్షణ కోరుతూ ఇంతటి గొప్ప హెల్త్ క్యాంప్ నిర్వహించినందుకు సత్తుపల్లి జామే మసీద్ కమిటీ అధ్యక్షుడు ఎస్.కే.ఎస్ రసూల్, కార్యదర్శి కమల్ పాషాలను అభినందించారు. హెల్త్ క్యాంపులో పాల్గొన్న ప్రముఖ డాక్టర్లకు పేరు పేరునా ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేశారు. కావాలని ఏ డాక్టర్ కూడా పేషెంట్ ల విషయం లో నిర్లక్ష్యం వహించారని, పేషెంట్ ల ఆరోగ్యం, వారి ప్రాణాలు కాపాడటమే డాక్టర్స్ బాధ్యత అని తెలిపారు. ఉచిత హెల్త్ క్యాంప్‌లు నిర్వహించే ప్రతి ఒక్కరికి తోటి డాక్టర్లుగా, స్థానిక ఎమ్మెల్యేగా, కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. రోగులకు, ప్రజలకు పలు ఆరోగ్య సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గాదె చెన్నకేశవరావు, సొసైటీ చైర్మన్ చల్లగుండ్ల కృష్ణయ్య, మాజీ కౌన్సిలర్లు తోట సుజలరాణి, గ్రాండ్ మౌలాలి, మాజీ కౌన్సిలర్స్ దూదిపాల రాంబాబు, మందపాటి పద్మజ్యోతి, కాంగ్రెస్ మహిళా నాయకురాలు కుమారి, ఇండియన్ మెడికల్ అసోషియేషన్ అధ్యక్షులు శివాజీ, ప్రైవేట్ వైద్యులు అశోక్ కుమార్, షేక్ మౌలాలి, వనమా లక్ష్మణ్ సాయి, అశోక్, వినీత్ కృష్ణ, హర్షిత్, తులసి తదితరులు పాల్గొన్నారు.

# నయా ఫాసిస్టు పోకడలతో పాలన ప్రమాదకరం

**-సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని**




ప్రజాపక్షం/ఖమ్మం : దేశంలో బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం నయా ఫాసిస్టు పోకడలతో కూడిన పాలన కొనసాగిస్తుందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం విమర్శించారు. స్థానిక సుందరయ్య భవనంలో సిపిఎం పార్టీ ఖమ్మంజిల్లా కమిటీ సభ్యులు బండారు రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో తమ్మినేని మాట్లాడుతూ నరేంద్ర మోదీ 11 ఏళ్ల పరిపాలనలో కార్పొరేట్ సంస్థలకు లబ్ధి జరిగేలా నిర్ణయాలు జరిగాయని తెలిపారు. కార్పొరేట్ సంస్థల అభివృద్ధే దేశాభివృద్ధి అన్నట్లుగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుందని ఆయన విమర్శించారు. పేద, మధ్యతరగతి ప్రజలు, గ్రామీణ రైతాంగం, పట్టణ కార్మిక వర్గాలు ఆశించిన అభివృద్ధిని సాధించలేకపోయాయని ఆయన తెలిపారు. దేశంలో ద్రవ్యోల్బణం పెరిగి నిరుద్యోగం తారాస్థాయికి చేరిందని ప్రజల కొనుగోలు శక్తి హీన స్థాయికి దిగజారిందన్నారు. మతతత్వ భావజాలాన్ని ప్రజల్లోకి జొప్పించి వారి మధ్య అనైక్యతను సృష్టిస్తుందని తెలిపారు. చివరికి లౌకిక, సామ్రాజ్యవాద స్ఫూర్తికి నిలువుటద్దంగా నిలబడి భారత రాజ్యాంగాన్ని సైతం నిర్వీర్యం చేయడానికి అది సాహసిస్తుందని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ ఖమ్మంజిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు బండి రమేష్, నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, ఎం. సుబ్బారావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాచర్ల భారతి, యర్రా శ్రీనివాసరావు, మాదినేని రమేష్, జిల్లా కమిటీ సభ్యులు మెరుగు సత్యనారాయణ, నందిపాటి మనోహర్, బషీరుద్దీన్, యూస్ఫ్, మీరా సాహెబ్, నవీన్‌రెడ్డి, రమ్య, డా|| బారవి, ప్రకాష్, రవీందర్, రఫీ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీ ఓపికను పరీక్షించకండి

**- మాజీ జెడ్‌పి చైర్మన్ లింగాల కమల్‌రాజు**



ప్రజాపక్షం/ బోనకల్ : రాష్ట్రంలో ప్రజలకిచ్చిన హామీలను నిలబెట్టుకోలేని కాంగ్రెస్ పరిపాలన కొనసాగుతుందని, మీడియా ముసుగులో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై తప్పుడు ఆరోపణలు చేయటం సిగ్గుచేటని మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ జెడ్పి చైర్మన్ లింగాల కమల్‌రాజు అన్నారు. ఆదివారం బోనకల్ మండలం రావినూతల గ్రామంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అరాచక రాజకీయాలను సాధారణ జనజీవనంలోకి తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి దక్కిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలు అమలు చేతగాక ప్రధాన ప్రతిపక్షమైన బిఆర్ఎస్ పార్టీపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని, రేవంత్‌రెడ్డి జూబ్లీహిల్స్ ప్యాలెస్ నుండి తప్పుడు ప్రచారాలను సృష్టించి కేటిఆర్‌పై తప్పుడు ఆరోపణలు చేయటంపై మండిపడ్డారు. పత్రికా స్వేచ్ఛ పేరుతో తప్పుడు వార్తలు రాస్తాం అంటే తెలంగాణ సమాజం ఊరుకోదని పేర్కొన్నారు. కేసిఆర్ నాయకత్వంలో తొమ్మిదిన్నర సంవత్సరాలు అభివృద్ధి పథంలో ముందుకెళ్తే, రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రాన్ని దివాళా తీసే ప్రయత్నం చేస్తున్నారని ఆయన అన్నారు. అదేవిధంగా మధిర నియోజకవర్గంలో భట్టివిక్రమార్క అనుచరుల ఆగడాలు రోజురోజుకు శృతి మించిపోతున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులను వాడుకుని మధిరలో రాజకీయం చేయాలని చూస్తే ఊరుకునే ప్రసక్తే లేదని అన్నారు. ఈసమావేశంలో బోనకల్ మండల పార్టీ అధ్యక్షులు చేబ్రోలు మల్లికార్జున, సీనియర్ నాయకులు బంధం శ్రీనివాస్‌రావు, వేమూరి ప్రసాద్, బానోతు కొండ, పార ప్రసాద్, గద్దల వెంకటేశ్వర్లు, రవి, ఏడుకొండలు, రవికృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థపై అవగాహన





ప్రజాపక్షం/ మధిర : మధిర పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థపై డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క సూచనల మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క సతీమణి మల్లు నందని, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, పత్రికా ప్రతినిధులు పాల్గొన్నారు. మధిర మున్సిపాల్టీ ఉప కార్యనిర్వాహఖ ఇంజనీర్ వై.నరేష్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ అవసరం, ఉపయోగాలు, ప్రజారోగ్యం ప్రభావంపై వివరించారు. ఈ ప్రాజెక్ట్ అనుసంధాన పైపులు నుండి ట్రంక్ మెయిన్స్ వరకు అక్కడి నుంచి మురుగు శుద్ధి కేంద్రం వరకు ఎలా పనిచేస్తుందో వివరించారు. పైప్‌లైన్ నుంచి బయలుదేరే మురుగునీరు పైప్‌లైన్ నెట్ వర్క్ ద్వారా ఎలా సేకరించబడుతుందో, మ్యాన్‌హోల్స్ ఉపయోగం ఏమిటో వివరించారు. పట్టణంలో వర్షపునీరు వల్ల ఏర్పడుతున్న వరదల సమస్యపై డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క దృష్టికి తీసుకెళ్లగా దాని పరిష్కారానికి రూ.75కోట్ల వ్యయంతో 30కి.మీ పొడవుతో స్మార్ట్ వాటర్ డ్రైయిన్స్ నిర్మాణాన్ని మధిరకు తీసుకువచ్చారని తెలిపారు. అనంతరం రాజకీయ నాయకులను నుండి పలు సూచనలు, సలహాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాల్టీ అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లు కాంగ్రెస్ కార్యకర్తలకా.. నిరుపేదలకా..?

## అధికారుల మౌనం దేనికి సంకేతం



ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం : తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలులో ఆశ్చర్యకర విషయాలు చోటు చేసుకుంటున్నాయి. రాష్ట్రంలో 10 సంవత్సరాలు ఒకే ప్రభుత్వం ఉంటే సంక్షేమ పథకాలు అమలులో అధికార పార్టీ వర్గం వారికి మండల గ్రామస్థాయి నాయకులు చెప్పిన వారికి సంక్షేమ పథకాలు ఎక్కువ చెందుతున్నాయని భావించిన ప్రజలు మార్పు పేరుతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరి తెచ్చుకున్నారు. ఇక్కడ అసలు విషయం ప్రజల మనస్సులను కలవరపెడుతుంది. గత ప్రభుత్వంలో చేసిన తప్పిదాలే ఇందిరమ్మ రాజ్యంలో కూడా జరుగుతున్నాయని నిరుపేదలు మనోవేదనకు గురవుతున్నారు. తిరుమలాయపాలెం మండలంలో 40 గ్రామపంచాయతీల పరిధిలో సుమారు 768 ఇండ్లు మంజూరు కాగా ఏ ఒక్క గ్రామంలో అర్హులకు ఇండ్లు రాలేదని వివిధ గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇందిరమ్మ కమిటీలు నిర్ణయించిన వారికే ఇండ్లు కేటాయించారని, ఈ విషయంలో అధికారుల ప్రమేయం ఏమి లేదని తేటతెల్లమవుతుంది. పాలేరు శాసనసభ్యులు, రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పదే పదే వివిధ సభల్లో ప్రస్తావించే విషయం అర్హులు కాకుండా అనర్హులకి ఇండ్లు ఎవరైనా కేటాయిస్తే అధికారులు రీ సర్వే చేసి అర్హులకు మాత్రమే ఇండ్లు కేటాయిస్తారని చెప్తూ వచ్చారు. మంత్రి మాటను నమ్మిన ప్రజలు తప్పనిసరిగా నిరుపేదలకు ఇండ్లు వస్తాయని భావించారు. కానీ గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్లు వ్యవసాయ భూములు ట్రాక్టర్లు అంతకుముందే ఇండ్లు ఉన్న కాంగ్రెస్ జెండాలు పట్టుకుని తిరిగే వారికి ఇండ్లు కేటాయించారని ప్రజలు ఆరోపిస్తున్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పిదాలే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా చేస్తుందని ప్రజలు భావిస్తున్నారు. మండల పరిధిలోని పలు చోటమోటా నాయకులు చెప్పే మాట రెండు మూడో విడతల్లో తప్పనిసరిగా అందరికీ ఇండ్లు వస్తాయని చెప్తున్నప్పుడు మొదటిగా ఇందిరమ్మ కమిటీలు నిరుపేదలకు ఇండ్లు ఇస్తే బాగుంటుందని భావిస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఏర్పడి సుమారు రెండు సంవత్సరాలు కావస్తున్న రెండో విడత, మూడో విడత ఇప్పట్లో ఉంటుందా అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే హైకోర్టు 90రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని ఆదేశించగా ఈలోపు ఎన్నికల కోడ్ వస్తే ఇందిరమ్మ ఇండ్లు ఇప్పటిలో రావని ఇండ్లు రాని నిరుపేద ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


# పసుమర్తి సీతాచంద్రరావుకు ఘన సన్మానం





ప్రజాపక్షం/వైరా: వైరా ఆర్యవైశ్య కళ్యాణ మండపం నందు ఆర్యవైశ్య మండల సభ అధ్యక్షులు మిట్టపల్లి కిరణ్‌కుమార్ అధ్యక్షతన నూతనంగా ఎన్నికైనటువంటి ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు పసుమర్తి సీతాచంద్రరావుకి ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీ నారాయణ, ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ తక్షణ మాజీ అధ్యక్షులు వనమా వేణుగోపాల రావు, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకులు వైరా వర్తక సంఘం అధ్యక్షులు వనమా విశ్వేశ్వర రావు పాల్గొన్నారు. ఆర్యవైశ్య మహాసభ మహిళా అధ్యక్షురాలు దోసపాటి సంధ్యారాణికి, ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ ప్రథమ ఉపాధ్యక్షులు నూకల శ్రీనివాసరావుకి కూడా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవాది లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ పసుమర్తి చంద్రరావు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆర్యవైశ్యులు అందరూ ఐక్యంగా ఉండి పోటీచేసి మన ఆర్యవైశ్యులు ఏ పార్టీ నుండి పోటీ చేసిన పార్టీలకతీతంగా మన సభ్యుల గెలుపు కోసం కృషి చేయాలని, అలాగే ఎవరైనా పేద ఆర్యవైశ్యులు ఉన్నట్లయితే వారికి తమవంతు సహాయ సహకారాలు అందించాలని తమ ప్రసంగంలో తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు దారా వెంకటకృష్ణ, మహిళా మండల అధ్యక్షురాలు బొగ్గవరపు సునీత, ఆర్యవైశ్య సంఘం నాయకులు డాక్టర్ పెరుమాళ్ళ కృష్ణమూర్తి, కొప్పురావూరి వెంకటేశ్వరరావు, మిట్టపల్లి సత్యంబాబు, నూకల ప్రసాదరావు, వెంకటసుబ్బారావు, చక్రధరరావు, మిట్టపల్లి వెంకటరమణ, గజ్జల కృష్ణమూర్తి, సముద్రాల మురళీకృష్ణ, కొల్లా రాంబాబు, చల్లా వెంకటరమణ, జిల్లా అవినాష్, బోనాల సాయి నిఖిల్, తెల్లాకుల సందీప్, విజయ్‌కుమార్, యండ్రపూడి శివశంకర్, ఆర్యవైశ్య యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కొప్పురావూరి శబరినాథ్, యువజన సంఘం మండల అధ్యక్షుడు వెంకటసుజిత్, కొమిరిశెట్టి శ్రీధర్, వేమూల కిషోర్, కలకం శివకృష్ణ, నూకల అన్నపూర్ణ, కొదుమూరి భాగ్యశ్రీ, రాయల రోజా, రాయల అన్నపూర్ణ, గజ్జల మాణిక్యమ్మ, వనమా మణికుమారి, మిట్టపల్లి మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ తీరు మారకుంటే మూల్యం చెల్లించక తప్పదు : నున్నా




ప్రజాపక్షం/చింతకాని : ఎన్నికల హామీలు అమలు చేయకుంటే బిఆర్ఎస్ లాగా కాంగ్రెస్ పార్టీ కూడా మూల్యం చెల్లించక తప్పదని సీపీఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం చింతకాని మండల కేంద్రంలో సీపీఎం పార్టీ రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో నున్నా మాట్లాడుతూ దేశంలో నరేంద్రమోదీ కులాల మతాల మధ్య చిచ్చు పెడుతూ పాలన సాగిస్తున్నాడని కార్పొరేట్లకు దోచిపెడుతూ పేదల పై పన్నుల భారం మోపుతున్నాడన్నారు. తెలంగాణ కేసీఆర్ తొమ్మిదేళ్ల పాలనలో మోడీ విధానాలు అవలంబించడం వల్లే ప్రజలు కేసీఆర్‌ను ఫామ్ హౌస్‌కు పరిమితం చేశారన్నారు. ఈ సమావేశంలో పార్టీ మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు, సిపిఎం మండల కార్యదర్శి రాచబంటి రాము, నాయకులు తోటకూరి వెంకటనర్సయ్య, మాదినేని రవి, దేశబోయిన ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.